


నెక్స్ట్ పరీక్షపై అపోహలు తొలగాలి

వైద్య విద్యార్థుల్లో 'నెక్ట్స్' (నేషనల్ ఎగ్జిట్ టెస్ట్) పై అపోహలు తొలగాలని నేషనల్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ సురేష్ అన్నారు. -8లో



కార్యకర్తలకు అండగా ఉంటా

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. -8లో



పరిహారం పంపిణీకి కసరత్తు

గండికోట ముంపు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం పరిహారం పంపిణీ చేయనుంది. -8లో

న్యూస్‌రీల్

గండికోటలో కలెక్టర్ పర్యటన

జమ్మలమడుగు: ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటలో జిల్లా కలెక్టర్ విజయ రామరాజు పర్యటించారు. మంగళవారం సాయంత్రం ఆర్డీఓ జి.శ్రీనివాసులు, ఒబెరాయ్ ప్రతినిధులతో కలిసి గండికోటలో పర్యటించారు. జులై 7, 8 వ తేదీల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా గండికోటకు వచ్చే అవకాశాలుండటంతో పాటు ఒబెరాయ్ రిసార్టు పనుల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొంటారనే సమాచారం ఉంది. దీంతో జిల్లా కలెక్టర్ విజయరామరాజు అధికారులతో కలసి సీఎం వైఎస్ జగన్ పర్యటన కోసం హెలీప్యాడ్ నిర్మాణంతోపాటు, రిసార్టు కోసం జరుగుతున్న పనులను పరిశీలించారు.

గ్రామాభివృద్ధిలో ఆర్పీల పాత్ర కీలకం



మాట్లాడుతున్న డీపీఓ ప్రభాకర్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: గ్రామాభివృద్ధిలో రీసోర్స్ పర్సన్ల (ఆర్పీ)పాత్ర కీలకమైనదని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో రీసోర్స్ పర్సన్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రీసోర్స్ పర్సన్లకు జీపీడీపీ, ఈ-గ్రామ స్వరాజ్, పీఎఫ్ఎంఎస్ అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ అంశాలపై గ్రామ కార్యదర్శుల అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత రీసోర్స్ పర్సన్లపై ఉంటుందన్నారు. అలా చేసినపుడే గ్రామ కార్యదర్శులు మరింత చురుగ్గా పనిచేసి గ్రామాభివృద్ధికి పాటుపడతారన్నారు. అనంతరం జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు హుసేన్‌బాష, సత్యనారాయణలు రీసోర్స్ పర్సన్లకు శిక్షణ ఇచ్చారు.

దూరవిద్య కోర్సుల ఏర్పాటుకు బోర్డు సభ్యుల పరిశీలన

వైవీయూ: వైవీయూ ఆధ్వర్యంలో 2023-24 విద్యాసంవత్సరం నుంచి దూరవిద్య కోర్సులు ప్రారంభించేందుకు వర్చువల్ విధానంలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బోర్డు (డెబ్), న్యూఢిల్లీ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య చింతా సుధాకర్ వైవీయూ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ప్రారంభానికి గల అనుకూలతలను వివరించారు. వైవీయూ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా దూరవిద్య కోర్సుల గురించి వివరించారు. వైవీయూలో ఈ విద్యాసంవత్సరం నుంచి 7 అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులు, 9 పీజీ కోర్సుల కోర్సుల ప్రారంభానికి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బోర్డు న్యూఢిల్లీ ప్రతినిధులు ఘోష్, జయలక్ష్మి వర్చువల్ విధానంలో పరిశీలించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ఉప సంచాలకులు ఆచార్య శ్రీధర్‌బాబు, సహాయ సంచాలకులు డా. శ్యాం స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

పుష్కలం.. భూగర్భ జలం

- రూ. 5.62 కోట్లతో ఉప్పలూరు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు
- కేవలం 20 రోజుల్లోనే పనులు పూర్తి
- 2000 ఎకరాల ఆయకట్టుకు మేలు
- నేడు నీటిని విడుదల చేయనున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ట్రయల్‌రన్‌లో భాగంగా నీటిని వదిలిన దృశ్యం



జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ నుంచి ఏర్పాటు చేసిన పైపులైన్

కడప సిటీ : ఆ రైతులు ఎన్నో ఏళ్లుగా భూగర్భ జలాలు పుష్కలంగా లేక... వేసిన పంట చేతికి రాక ఆర్థికంగా చితికిపోయారు. వెయ్యి అడుగులు బోరు వేస్తేగానీ నీరు బయటికి రాని పరిస్థితి. ఒకవేళ వచ్చినా ఎప్పుడు ఎండుతుందో, వేసిన తోటలు కొట్టివేయాల్సి వస్తుందో అన్న దీన పరిస్థితి ఆ రైతులది. గత 25 ఏళ్లుగా వీరిని ఆదుకునేందుకు ప్రయత్నాలు చేసినప్పటికీ సఫలం కాలేదు. గత టీడీపీ ప్రభుత్వం కూడా ప్రయత్నం చేయకుండా వదిలేసింది. ఆ తర్వాత ఆ రైతులు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి దృష్టికి తమ సమస్యను తీసుకు వచ్చారు. వారు జిల్లా కలెక్టర్ విజయరామరాజుతో ప్రాధాన్యత కింద ఉప్పలూరు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని విన్నవించారు. ఈ నేపథ్యంలో డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) కింద రూ. 5.62 కోట్లు ఈ పనులకు కేటాయించి కేవలం 20 రోజుల్లోనే 4.35 కిలోమీటర్ల మేర జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ నుంచి ఏర్పాటు చేసి ఆరు చెరువులకు నీళ్లను నింపి తద్వారా భూగర్భ జలాలు పెంపొందించి 2000 ఎకరాల ఆయకట్టుకు సంబంధించిన పండ్ల తోటలను రక్షించే ప్రయత్నం సఫలమైంది. మంగళవారం ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు సంబంధించి జీఎన్ఎస్ఎస్ ఎస్ఈ మల్లికార్జునరెడ్డి పర్యవేక్షణలో ట్రయల్ రన్ కూడా విజయవంతంగా ముగిసింది. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ఇందుకు సంబంధించిన నీటి విడుదల కార్యక్రమానికి బుధవారం హాజరై ప్రారంభించనున్నారు.

జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ నుంచి

గాలేరు - నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్) ప్రధాన కాలువ 21.5 కిలోమీటర్ల వద్ద ముద్దనూరు మండలం ఉప్పలూరు గ్రామ పరిసరాల్లో ఉప్పలూరు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఏర్పాటైంది. ఇక్కడి నుంచి 4.35 కిలోమీటర్ల మేర పైపులైన్‌ను 20 రోజుల్లోపే పనులు పూర్తి చేసి నీటిని ఇచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. హైదరాబాదుకు చెందిన ఎస్ఎల్ఆర్ ఇన్‌ఫ్రా కంపెనీ ఈ పనులు చేపట్టింది.

ఆరు చెరువులు ద్వారా...

జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ నుండి ఏర్పాటు చేసిన పైపులైన్ ద్వారా నీటిని పంపి ఆ ప్రాంతంలో ఉన్న ఆరు చెరువులను నింపుతారు. ఈ నేపథ్యంలో చెరువుల ద్వారా బోరు బావులకు భూగర్భ జలాలు పుష్కలంగా అందడంతో ప్రస్తుతం సాగు చేస్తున్న చీనీ, నిమ్మ, ఇతర పంటలను రైతులు కాపాడుకునేందుకు వీలుంటుంది. బోరు బావుల్లో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ఉప్పలూరు పూల చెరువు, పెద్దచెరువు, చిన్న చెరువు, కొలవలి చెరువు, వేపరాల చెరువు, పెనికలపాడు చెరువులను ఈ పైపులైన్ ద్వారా నింపనున్నారు. ఇందుకుగాను 30 ఎంసీఎఫ్‌టీ నీటిని జీఎన్ఎస్ఎస్ నుంచి విడుదల చేస్తారు.

శాశ్వత పరిష్కారం

ప్రస్తుతం రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో తాత్కాలికంగా వారి పండ్ల తోటలను రక్షించేందుకు ఆగమేఘాల మీద ఈ పనులను చేసి నీటిని వదులుతున్నారు. అయితే శాశ్వత పరిష్కారాన్ని చూపేందుకు మరింత పైపులైను ఏర్పాటు చేయాల్సి ఉంది. వామికొండ రిజర్వాయర్ నుండి అదనంగా మరో పైపులైన్ వేసి ఉన్న పైపులైనుకు అనుసంధానం చేసి ఇక శాశ్వతంగా ఆ రైతులకు ఇబ్బందులు లేకుండా చేయాలన్నది ప్రధాన సంకల్పం. త్వరలో ఈ పనులను చేపట్టి ఈ లిఫ్ట్‌కు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు అధికారులు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు.

రెండు వేల ఎకరాలకు భూగర్భ జలాలు



ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రెండు వేల ఎకరాలకు సంబంధించి భూగర్భ జలాలు పుష్కలంగా అందనున్నాయి. జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ నుంచి పైపులైన్ ఏర్పాటు చేసి చెరువులను నింపడంతో తద్వారా ఆ ప్రాంతంలో ఉన్న బోర్లకు భూగర్భ జలాలు బాగా పెరిగి రైతుల పండ్ల తోటలు సస్యశ్యామలం అయ్యేందుకు అవకాశం ఉంటుంది. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఈ పనులను పర్యవేక్షిస్తూ వచ్చారు. ఆయన బుధవారం నీటిని విడుదల చేయనున్నారు. – మల్లికార్జునరెడ్డి, ఎస్ఈ, జీఎన్ఎస్ఎస్, కడప

సమన్వయంతో పనిచేయాలి

- ఐసీడీఎస్ కర్నూలు ఆర్‌జేడీ పద్మజ



మాట్లాడుతున్న ఐసీడీఎస్ కర్నూలు జోన్ ఆర్‌జేడీ పద్మజ

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాల్య వివాహాల నిర్మూలన అనేది అన్ని శాఖల సమన్వయంతో కృషి చేసినట్లయితే ఫలితం ఉంటుందని ఐసీడీఎస్ కర్నూలు జోన్ ఆర్‌జేడీ పద్మజ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మహిళా శిశు సంక్షేమశాఖ, యునిసెఫ్ వారి సమన్వయంతో జిల్లా స్థాయి మాస్టర్స్ ట్రైనర్ ట్రైనింగ్ ప్రోగామ్ మొదటిరోజు శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ బాల్య వివాహాల నిలుపుదలలో గ్రామస్థాయిలో మహిళా పోలీసుల పాత్ర ప్రధానమైందన్నారు. జిల్లా మహిళా సంక్షేమశాఖ సాధికారత అధికారి డి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు, సామాజిక పరివర్తన మార్పుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. రీసోర్స్ పర్సన్స్ కృష్ణవేణి, యునిసెఫ్ పవర్ పాయింట్ ద్వారా గ్రూప్ డిస్కషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీపీఓ సుభాష్ యాదవ్, దిశ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ వినయ్‌కుమార్‌రెడ్డి, మహిళా ఎస్ఐ నజీరున్, కెతుర, మహిళా పోలీసులు చంద్రకళ, మీనాక్షి, వసంతలక్ష్మి, సునీత, అంజలితోపాటు డీఆర్‌డీఏ, మెప్మా, విద్యాశాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో టీహెచ్ఆర్

అంగన్వాడీ కేంద్రాల్లో జులై 15 నుంచి టీహెచ్ఆర్ (టేక్ హోమ్ రేషన్) విధానం అమలులోకి రానుందని ఐసీడీఎస్ కర్నూలు జోన్ ఆర్‌జేడీ పద్మజ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఐసీడీఎస్ కాన్ఫరెన్స్ హాలులో సీడీపీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సీడీపీఓలకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీ శ్రీలక్ష్మి, డీసీపీఓ సుభాష్ యాదవ్, సీడీపీఓలు అరుణకుమారి, ముంతాజ్‌బేగం, సునంద, వసంత, కార్యాలయ సిబ్బంది వనజ, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత

పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



నగరవనం అభివృద్ధి పనుల గురించి కలెక్టర్ విజయరామరాజుతో చర్చిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

వేంపల్లె : ప్రభుత్వం విద్యతోపాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా వేంపల్లెలోని కడప రోడ్డులో ఉన్న వైఎస్సార్ క్రీడా వికాస కేంద్రంతోపాటు గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, దోబీఘాట్లు పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి వారు ప్రారంభించారు. వేంపల్లె పట్టణంలోని నూతనంగా నిర్మించిన 1, 6, 7 గ్రామ సచివాలయాలు, 1, 5, 7 రైతు భరోసా కేంద్రాలు, రూ.2కోట్ల వ్యయంతో నిర్మించిన ఇండోర్ స్టేడియం, రూ.10లక్షలతో నిర్మించిన దోబీఘాట్లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని తెలిపారు. వేంపల్లెలో ఇప్పటివరకు రూ.400కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. నియోజకవర్గంలో పులివెందుల తర్వాత వేంపల్లెకు సీఎం అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, సర్పంచ్ శ్రీనివాసులు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వేణుగోపాల్, డీఈఈ శ్రీకాంత్, పీఆర్ డీఈ రవిచంద్రారెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి, ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, ఏఓ రాజేంద్ర ప్రసాద్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలో మోడల్ టౌన్‌లో భాగంగా 29 పనులకు సంబంధించి దాదాపు రూ.639కోట్ల వ్యయంతో జరుగుతున్న పనులను మంగళవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కలెక్టర్ విజయరామరాజు పరిశీలించారు. జులై మొదటి వారంలో సీఎం వైఎస్ జగన్ పులివెందుల పర్యటనలో భాగంగా ఆయన ప్రారంభించబోయే పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని వారు అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. పట్టణంలోని నగరవనంలో జరుగుతున్న పనులను , ఫిష్ ఆంధ్రా హబ్‌ను పరిశీలించారు. క్రికెట్ స్టేడియం పనులను, ధ్యాన్‌చంద్ క్రీడా మైదానంలో జరుగుతున్న హాకీ బిల్డింగ్ పనులను పరిశీలించారు. పులివెందుల అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ పులివెందుల పట్టణాన్ని సుందరీకరణగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. అనంతరం పులివెందుల సిటీ ఫారెస్ట్ గరండాల్, హాకీ స్టేడియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లతోపాటు పలు అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. జేసీ గణేష్‌కుమార్, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, ఆర్ అండ్‌బీ ఈఈ సిద్ధారెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు పాల్గొన్నారు.

అర్హులందరికీ బిందు సేద్య పరికరాలు



బిందు సేద్య పరికరాల వాహనాన్ని ప్రారంభిస్తున్న పీడీ రవీంద్రనాథరెడ్డి

కడప అగ్రికల్చర్: జిల్లాలో బిందు సేద్య లబ్ధిదారులకు సకాలంలో పరికరాలను అందచేస్తామని ఏపీ ఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథరెడ్డి అన్నారు. బిందు సేద్య పరికరాల పంపిణీలో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని పులివెందుల మండలం బ్రహ్మణపల్లిలో పీడీ రవీంద్రనాథ్‌రెడ్డి, బ్రహ్మణపల్లె వార్డు కౌన్సిలర్ మహేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో బిందు సేద్య పరికరాల వాహనాన్ని ప్రారంభించారు. పీడీ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి 10,500 హెక్టార్లకు ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు.

రిమ్స్ సూపరింటెండెంట్‌గా రమాదేవి బాధ్యతల స్వీకరణ

కడప అర్బన్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో పీడియాట్రిక్ హెచ్ఓడీగా పనిచేస్తున్న డాక్టర్ రమాదేవి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు అనంతపురం జిల్లా సర్వజన ఆసుపత్రికి బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రమాదేవికి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్ రమాదేవికి పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



డాక్టర్ రమాదేవికి శుభాకాంక్షలను తెలియజేస్తున్న వెంకటేశ్వరరావు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



ఒలంపిక్ టార్చ్‌తో రన్ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా

కడప స్పోర్ట్స్: కడప నగరంలో మంగళవారం నిర్వహించిన ఒలంపిక్ డే రన్ ఉత్సాహంగా సాగింది. కడప లోని డీఎస్ఏ క్రీడామైదానం నుంచి ప్రారంభమైన ఒలంపిక్ రన్‌ను ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఒలంపిక్ టార్చ్‌ను పట్టుకుని పరుగులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో క్రీడారంగం అభివృద్ధి సాధిస్తోందన్నారు. త్వరలోనే 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాపోటీలకు రంగం సిద్ధమైందన్నారు. ప్రభుత్వం క్రీడలకు ఇస్తున్న ప్రోత్సాహాన్ని చూస్తున్న దిగ్గజ క్రీడాకారులు ముఖ్యమంత్రిని కలిసి తమవంతు సహకారం అందించేందుకు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు కె.ఎస్. సమరనాథరెడ్డి, కార్యదర్శి కె.వై. సునీల్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో క్రీడల అభివృద్ధికి ఒలంపిక్ సంఘం సహకారం అందిస్తుందన్నారు. ఏపీ పీఈటీస్ అండ్ ఎస్ఏ (పీఈ) అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మిద్దె ప్రవీణ్‌కిరణ్ మాట్లాడుతూ క్రీడాసంఘాలు క్రీడాకారుల అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. అనంతరం ఒలంపిక్ రన్ స్టేడియం నుంచి నెహ్రూ పార్కు, పోలీస్‌లైన్, ఎస్పీ బంగ్లా మీదుగా కోటిరెడ్డి సర్కిల్ చేరుకుంది. కార్యక్రమంలో డీఎస్ఏ చీఫ్ కోచ్ అమృతరాజ్, కార్పొరేటర్లు ఎస్ఎండీ షఫీ, డివిజన్ ఇన్‌చార్జిలు మల్లికార్జున కిరణ్, ఈటె రామచంద్రయ్య, బండిబాబు, డీఎస్ఏ శిక్షకులు పాల్గొన్నారు.

అమ్మ ఒడి... నిధుల సవ్వడి

- నాలుగో విడతలో 1,80,203 మంది విద్యార్థులకు లబ్ధి
- నేడు తల్లుల ఖాతాకు రూ. 270 కోట్లు జమ
- గ్రామ, వార్డు సచివాలయాల వారిగా జాబితా ప్రదర్శన
- నేడు కడప కలెక్టరేట్ సభాభవన్‌లో జిల్లా కార్యక్రమం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: పిల్లలను పాఠశాలలకు పంపుతున్న తల్లులకు జగనన్న అమ్మఒడి నాలుగవ విడత ఆర్థిక లబ్ధిని ప్రభుత్వం బుధవారం జమచేయనుంది. జిల్లాలో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న పేద విద్యార్థులను అర్హులుగా గుర్తించి ఎంపిక చేసిన ప్రభుత్వం వారి తల్లుల బ్యాంకు ఖాతాకు నగదును జమచేయనుంది. ఇప్పటికే అమ్మ ఒడి అర్హుల జాబితాను గ్రామ, వార్డు సచివాలయాలో ప్రదర్శించారు. ఈ ఏడాది జిల్లాలో మొత్తం 1,80, 203 మంది తల్లులకు రూ. 15 వేల చొప్పున రూ. 270.30 కోట్ల ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించనుంది.

బడిబాట పట్టించేలా...

గతంలో చాలామంది పేదలు ఆర్థిక సమస్యల కారణంగా తమ పిల్లలను బడికి కాదని పనులకు పంపేవారు. ప్రజా సంకల్పయాత్రలో ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా విన్న వైఎస్ జగన్ అధికారం లోకి రాగానే ప్రతి విద్యార్థి చదివాలనే ఉద్దేశ్యంతో అమ్మ ఒడిని తీసుకొచ్చి బడికి పంపే ప్రతి తల్లిఖాతాకు రూ. 15 వేల నగదును జమ చేసి చదువును ప్రోత్సహించారు. తెల్ల రేషన్ కార్డు కలిగి ప్రభుత్వ లేదా ప్రైవేటు పాఠశాలల్లో చదివించే పిల్లలకు అమ్మ ఒడి పథకం వర్తిస్తూ 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఈ పథకం కింద సాయం అందచేస్తూ వస్తున్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక...

అమ్మ ఒడి ఆర్థిక ప్రయోజనాన్ని అందుకునేందుకు ఉద్దేశించిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రభుత్వం చాలా పారదర్శకంగా నిర్వహించింది. గ్రామ, వార్డు సచివాయాల వారిగా వలంటీర్లు క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి అర్హులైన వారిని ఎంపిక చేశారు.

నియోజకవర్గం	లబ్ధిదారులు
బద్వేల్	26,467
జమ్మలమడుగు	25,307
కడప	35,263
కమలాపురం	20,747
మైదుకూరు	28,427
పొద్దుటూరు	24,030
పులివెందుల	23,562

చదువుకు భరోసా...



ప్రభుత్వం ఏటా అమ్మ ఒడి పథకం కింద ఆర్థికసాయాన్ని నేరుగా తల్లుల ఖాతాల్లో జమచేస్తోంది. ఈ ఏడాది నాలుగో విడత సొమ్మును అందజేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంది. ఈ ఏడాది జిల్లాలో 1,80,203 మందికి రూ. 270 కోట్లు జమకానుంది. ఇందుకు సంబంధించి బుధవారం కడప కలెక్టరేట్ సభాభవన్‌లో జిల్లాస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నాం.
– ఎద్దుల రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి

క్లుప్తంగా

సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ, జడ్జి ప్రదీప్‌కుమార్

కడప అర్బన్ : పిల్లలు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్ తెలియజేశారు. మంగళవారం కడప నగరంలోని చిన్నచౌక్‌లో వున్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికల)ను సందర్శించి న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. వంట గదులను, వసతి గదులను, తరగతి గదులను పరిశీలించారు. మధ్యాహ్న సమయంలో వారికి అందుతున్న భోజనం సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల విద్యా, ఆరోగ్య విషయాలపట్ల తగు జాగ్రత్తలు వహించాలని అధికారులను ఆదేశించారు. విద్య విలువైనదనీ క్రమశిక్షణతో అభ్యసించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికారసంస్థ కడప వారి దృష్టికి తీసుకుని రావచ్చన్నారు. ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో క్రిష్ణజింక మృతి



క్రిష్ణజింకను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

కొండాపురం : మండల పరిధిలోని చవ్వనాగాయపల్లె గ్రామానికి చెందిన రైతు పొన్నతోట వెంకట నారాయణరెడ్డి చీనీ తోటలో సోమవారం సాయంత్రం కుక్కల దాడిలో క్రిష్ణజింక మృతి చెందింది. సంఘటన స్థలానికి ముద్దనూరు ఎఫ్ఆర్ఓ ఎస్.అశోక్‌కుమార్‌యాదవ్ మంగళవారం చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కలు వెంబడించడంతో బురదలో ఇరుక్కోవడంతో కరుస్తుండగా స్థానిక రైతులు కేకలు వేయడంతో కుక్కలు పారిపోయినట్లు తెలిపారు. క్రిష్ణజింకకు గాయాలై, తీవ్ర రక్తస్రావం కావడంతో మృతి చెందిందని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో రెవెన్యూ సహాయకులు పుల్లయ్య, జయరాజు, తాళ్లప్రొద్దుటూరు పోలీస్ సిబ్బంది భాస్కర్ యాదవ్, రవీంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.సుబ్బరాయుడు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్రిష్ణజింకకు సుమారు నాలుగు లేదా ఐదు సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. మృతదేహాన్ని ముద్దునూరు పశు ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

పరిహారం పంపిణీకి కసరత్తు

- గండికోట ముంపు బాధితులను ఆదుకుంటున్న ప్రభుత్వం
- త్వరలో 14 గ్రామాలకు 3.25 లక్షల అందజేతకు చర్యలు

జమ్మలమడుగు : గండికోట ముంపు గ్రామాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పది లక్షల రూపాయల పరిహారం అందించబోతున్నారు. మొదటి విడత కింద ఉన్న 14 గ్రామాల్లో 9096 మంది ముంపు బాధితులు ఉండగా అందులో 4195 మందికి ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద, 4901 మందికి వన్‌టైం సెటిల్‌మెంట్ కింద పరిహారం రూ.6.75 లక్షలు అందించారు. 1179 మందికి సరైన పత్రాలు లేకపోవడంతో ఇవ్వలేదు. సరైన ఆధారాలుంటే తప్పకుండా ఇస్తామని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు.

- రెండోవిడత గ్రామాలైన కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు, చామలూరు, ఎర్రగుడి గ్రామాల్లో మొత్తం 7047 మంది ముంపు బాధితులు ఉండగా అందులో 1561 మంది ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, 5486 మంది వన్‌టైం సెటిల్ మెంట్ ఆప్షన్ తీసుకున్నారు. వీరిలో 6837 మందికి పరిహారం ఇచ్చారు.ఇంకా 210 మందికి ఇవ్వాల్సి ఉంది. రెండో విడతలో 95 శాతం పరిహారం అందినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.
- మూడో విడత గ్రామాలైన పెంజిఅనంతపురం, ఏటూరు, రేగడిపల్లి, కె.సుగుమంచిపల్లె గ్రామాల్లో 1666 మంది ముంపు బాధితులు ఉన్నారు. ఇందులో 100 మంది ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ, 1566 మంది వన్‌టైం సెటిల్ మెంట్ ఆప్షన్ తీసుకున్నారు. ఇప్పటి వరకు 668 మందికి పరిహారం అందింది. 998 మందికి అందాల్సి ఉంది.



గండికోట ప్రాజెక్టు

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు..

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గండికోట ముంపు బాధితులకు రూ.6.75 లక్షలతోపాటు అదనంగా 3.25 లక్షలు పరిహారం అందిస్తామని 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ముంపు బాధితులకు పరిహారం అందించే ప్రక్రియను మొదలు పెట్టారు. 2021లో గండికోటలో పూర్తి స్థాయిలో నీరు నిలపాలనే ఉద్దేశంతో రెండో విడత, మూడో విడత గ్రామాలైన కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు, చామలూరు, ఎర్రగుడి, పెంజి అనంతపురం, ఏటూరు, రేగడిపల్లి, కె.సుగుమంచిపల్లె గ్రామాల ప్రజలకు త్వరితగతిన పది లక్షల రూపాయల పరిహారం ఇచ్చిన తర్వాతనే ఇళ్లను ఖాళీ చేయించారు. ప్రస్తుతం మొదటి విడత కింద ఎంపికైన 14 గ్రామాలైన చౌటపల్లి, సీతారామపురం, గండ్లూరు, ఓబన్నపేట, కె.బొమ్మేపల్లి, దొరువుపల్లి, బుక్కపట్నం, గంగాపురం, రేపల్లి, ముచ్చుమర్రి, పక్కీర్‌పేట, దత్తాపురం, నేదరపేట, ముద్దనూరు మండలంలోని కొర్రపాడు గ్రామాలు ఉన్నాయి. వీరికి రూ.6.75 లక్షల పరిహారం అందించారు. ప్రస్తుతం వీరికి రూ.3.25 లక్షల పరిహారం ఇవ్వడం కోసం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చర్యలు తీసుకుంది. మరో రెండు మూడు నెలల్లో వీరి ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే అవకాశం ఉంది.

రూ.10 లక్షల పరిహారం తీసుకున్న గ్రామాలు

గ్రామం	ముంపు బాధితులు	పరిహారం ఇచ్చింది	పెండింగ్
రెండో విడత			
కొండాపురం	3066	3009	57
తాళ్లప్రొద్దుటూరు	2869	2734	135
చామలూరు	587	572	15
యర్రగుడి	525	522	03
మొత్తం	7047	6837	210
మూడో విడత			
పెంజి అనంతపురం	677	26	651
ఏటూరు	291	248	43
రేగడిపల్లి	274	248	26
కె.సుగుమంచిపల్లి	424	146	278
మొత్తం	1666	668	998

వివరాలు సేకరిస్తున్నాం



మొదటి విడత కింద ముంపునకు గురైన 14 గ్రామాల ప్రజలకు రూ.3.25 లక్షలు అదనంగా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో ఆధార్ కార్డులతోపాటు, బ్యాంక్ అకౌంటు నంబర్లు ఇవ్వాలని ముంపు బాధితులకు సూచించాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తాం. రికార్డుల ప్రకారం ఇప్పటి వరకు 7917 మందికి ఒక్కొక్కరికి రూ.6.75 లక్షల పరిహారం ఇచ్చాం. మరో 1179 మందికి ఇవ్వలేదు. – జి.శ్రీనివాసులు, ఆర్డీఓ, జమ్మలమడుగు

పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

కళాశాల రెండో అంతస్తుపై నుంచి దూకిన మైనర్ బాలిక

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని ఎస్ఆర్ఐటీ కాలేజీలో పాలిటెక్నిక్ చదువుతున్న ఓ విద్యార్థిని అదే కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు.. కడపకు చెందిన మైనర్ బాలిక ప్రొద్దుటూరు మండలంలోని ఎస్ఆర్ఐటీ కాలేజీలో పాలిటెక్నిక్ మూడో సంవత్సరం చదువుతోంది. విద్యార్థిని కళాశాలకు చెందిన బస్సులోనే ప్రతి రోజు కడప నుంచి ప్రొద్దుటూరుకు వచ్చేది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కాలేజీకి వచ్చింది. కొద్ది సేపటి తర్వాత అందరూ చూస్తుండగానే ఒక్కసారిగా కళాశాల రెండో అంతస్తుపై నుంచి కిందికి దూకింది. తీవ్రంగా గాయపడిన విద్యార్థినిని కళాశాల సిబ్బంది వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకున్నారు. బాలిక రెండు కాళ్లు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్పీ ప్రేరణాకుమార్, టూ టౌన్ ఇబ్రహీం ఆస్పత్రికి వెళ్లి జరిగిన సంఘటనపై వివరాలు సేకరించారు. బాలిక ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం బాలికను కర్నూలుకు తరలించారు. బాలిక తండ్రి కడపలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. జరిగిన సంఘటనపై విచారణ చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. బాలిక ఆత్మహత్యాయత్నానికి ప్రేమ వ్యవహారమే కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కర్నూలులో చికిత్స పొందుతున్న విద్యార్థిని ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన అవసరం

కడప అర్బన్ : విద్యుత్ ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఏపీఎస్‌పీడీసీఎల్ విజిలెన్స్ అండ్ ఏపీటీఎస్ పీఎస్ కడప ఇన్‌స్పెక్టర్ దారెడ్డి భాస్కర్‌రెడ్డి తెలియజేశారు. మంగళవారం ఆయన తమ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 26 నుంచి జూలై 2వరకు విద్యుత్ భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వాటిల్లో పాటించాల్సిన కొన్ని నియమాలను వివరించారు.

- ఇంటికి ఎర్తింగ్ ఇచ్చేటపుడు కనీసం రెండు ఎర్త్ ఎలక్ట్రోడల్ అమర్చి, తడిగా వుంచాలి.
- ఇంటిలోని గ్రైండర్, ఏసీ, రిఫ్రిజిరేటర్‌లలో అసాధారణ శబ్దాలు వచ్చినపుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే మెకానిక్‌లను పిలిపించి వారిచేత మాత్రమే పరీక్షించాలి.
- గృహ విద్యుత్ ఉపకరణాలను వాడేటపుడు వాటి తయారీదారు నిర్దేశించిన సామర్థ్యం కలిగిన మూడు పిన్నుల ప్లగ్ సాకెట్లనే వాడుతూ, మూడవ పిన్‌ను విధిగా ఎర్తింగ్ చేయాలి.
- పొలాల్లో తెగిపడిన, లేదా జారిపడి తక్కువ ఎత్తులో వున్న విద్యుత్ వైర్లకు దూరంగా వుండి సంబంధిత విద్యుత్ సిబ్బందికి లేదా గ్రామ సచివాలయాల్లో ఉన్న ఎనర్జీ సహాయకులకు గానీ ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదు చేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్: 1912ను సద్వినియోగం చేసుకోవాలి.

జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ఎంపికల జాబితా విడుదల

– రాష్ట్ర స్థాయి ఎంపికలకు 34 మంది

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 4వ, 5వ తరగతిలో ప్రవేశం కోసం ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల జాబితాను మంగళవారం ప్రకటించారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఎంపికల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల జాబితాను స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్‌లు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4వ తరగతిలో 20 మంది, 5వ తరగతిలో 14 మంది చొప్పున జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లాకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి ఎంపికలకు హాజరు కావాలని సూచించారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు..

4వ తరగతి బాలురు : ఎస్.సలీంబాషా, జి.చరిత్, ఎస్.శివగణేష్, డి.ప్రశాంత్, ఎస్.జ్ఞానేశ్వర్, ఎం.చైతన్యమాధవరాజు, ఎం.లోహిత్, సి.ఎ.గురుస్వామి, పి.వీరగిరిధర్‌యాదవ్, ఆర్.పి.రిత్విక్‌ప్రసాద్, పి.ఎన్.చేతన్‌కుమార్, జి.వి.నిఖిల్‌కుమార్‌ఆచారి, జి.వెంకటనిరంజన్, ఆర్.యశ్వంత్‌కుమార్, ఎస్. రోషన్‌అలీ, జె.సాయికవిష్

4వ తరగతి బాలికలు : ఎం.భవిష్య, జి.వై.భవిష్య, కె.వెంకటధన్యశ్రీయాదవ్, కె.వెంకటలాస్య

5వ తరగతి బాలురు : జె.జ్ఞానదీపక్, ఎస్.చెన్నసురేష్, బి.ప్రణీత్‌కుమార్‌రెడ్డి, వి.శివశంకర్, బి.వెంకటేష్, జి.హేమంత్, కె.రెడ్డిసాత్విక్, జె.బెన్నిభరత్

5వ తరగతి బాలికలు : పి.గంగాకావ్య, ఎస్.తంజీం నర్సత్, పి.శివమారుషిక్, యు.పద్మావతి, టి.రుత్వికశ్రీ, జె.దీపాలి

క్రీడా పాఠశాల ప్రత్యేకాధికారిగా జగన్నాథరెడ్డి



కనం జగన్నాథరెడ్డి

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాల ప్రత్యేకాధికారిగా కనం జగన్నాథరెడ్డిని నియమిస్తూ శాప్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం స్పెషలాఫీసర్‌గా పని చేస్తున్న ఎస్.బాషామోహిద్దీన్ ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్నారు. దీంతో ఈయన స్థానంలో అనంతపురం చీఫ్ కోచ్‌గా పని చేస్తున్న కె. జగన్నాథరెడ్డి నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కనంపల్లికి చెందిన ఈయన 1992లో అండర్–16 విభాగంలో బాస్కెట్‌బాల్ క్రీడాకారుడిగా తన క్రీడాజీవితాన్ని ప్రారంభించారు. అనంతరం పలు టోర్నమెంట్‌లలో ప్రతిభ కనబరుస్తూ యూత్ నేషనల్ బాస్కెట్‌బాల్, జూనియర్ నేషనల్స్‌లో ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఈ సందర్భంగా ఆయన్ను ఫోన్ ద్వారా సంప్రదించగా త్వరలోనే క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తానని తెలిపారు.

ప్రజల ఐక్యతను బీజేపీ దెబ్బతీస్తోంది



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్

బద్వేలు అర్బన్ : దేశ ప్రజల ఐక్యతను దెబ్బతీస్తున్న బీజేపీని వ్యతిరేకించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఏ.గఫూర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో క్రమంగా తమ ప్రతిష్టను కోల్పోతోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన విభజన హామీల్లో బీజేపీ ప్రభుత్వం ఏ ఒక్కటి అమలు చేయలేదని అన్నారు. రాబోవు రోజుల్లో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఐ.ఎన్.సుబ్బమ్మ, సీఐటీయూ నాయకులు శ్రీనివాసులు, నాగేంద్ర, సీపీఎం నాయకులు దస్తగిరి, రామ్మోహన్, శివకుమార్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్ షెడ్ వద్ద మంగళవారం రాత్రి సాయికుమార్ (30) అనే యువకుడు గూడ్స్ రైలు కింద పడి మృతి చెందినట్లు కడప రైల్వే ఎస్సై రారాజు తెలిపారు. చెన్నూరు అరుంధతివాడకు చెందిన సాయికుమార్ కూలీ పనులు చేసుకుంటూ ఉండే వారన్నారు. కుటుంబ సమస్యలతో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇరు వర్గాల ఘర్షణ

లింగాల : లింగాల మండలం పెద్దకుడాల గ్రామానికి చెందిన సర్పంచ్ వర్గీయులు, ఎంపీటీసీ వర్గీయుల మధ్య మంగళవారం సాయంత్రం ఘర్షణ చోటు చేసుకుంది. సర్పంచ్ వర్గానికి చెందిన చంద్రారెడ్డి, ఎంపీటీసీ వర్గానికి చెందిన అనిల్‌కుమార్‌రెడ్డిల పొలాల వద్ద రహదారి విషయమై ఘర్షణ చోటు చేసుకుంది. ఇరువర్గాలు ఘర్షణకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వారిని పులివెందులలోని డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. ఇరు వర్గాలపై కేసులు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ హృషికేశవరెడ్డి తెలిపారు.

డాక్టర్ వెంకటేశ్వరరావు సేవలు మరువలేనివి



డాక్టర్ వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న రిమ్స్ వైద్యులు

కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల (రిమ్స్) సూపరింటెండెంట్‌గా పని చేసి, బదిలీ అయిన డాక్టర్ కేఏస్ఎస్ వెంకటేశ్వరరావు సేవలు, సహకారం మరువలేనిదని వైద్యాధికారులు, డాక్టర్లు కొనియాడారు. రిమ్స్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు అనంతపురం సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బదిలీపై వెళుతున్న డాక్టర్ వెంకటేశ్వరరావును రిమ్స్ ఆసుపత్రి సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వై. శ్రీనివాసులు ఆధ్వర్యంలో మానసిక విభాగం సీనియర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. వెంకటరాముడు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రాజేశ్వరి, గీత, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



అరెస్ట్ అయిన నిందితులు

కమలాపురం : స్థానిక దర్గా వీధిలో ఈ నెల 17వ తేదీన జరిగిన షేక్ మహ్మద్ జహీర్ సాహెబ్ (27) హత్య కేసులో నిందితులైన భార్య షేక్ యాస్మిన్, అత్త షేక్ టప్పా ఖదీరున్నిసాలను అరెస్ట్ చేసినట్లు కమలాపురం సీఐ సత్యబాబు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. షేక్ మహ్మద్ జహీర్ భార్య, అత్తతో కలసి అత్త ఇంట్లోనే నివాసం ఉంటున్నాడని, అలాగే ఇతడికి మద్యం సేవించే అలవాటు ఉందన్నారు. భార్య, అత్త ఇద్దరు ఇతర వ్యక్తులతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నారని, తరచూ వారితో గొడవ పడేవాడన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీన రాత్రి 10.30 గంటల సమయంలో మద్యం సేవించి వచ్చిన మహ్మద్ జహీర్‌ను.. ముందుగా ప్లాన్ చేసుకున్న ప్రకారం అత్త గొంతుకు ప్లాస్టిక్ తాడును గట్టిగా బిగించగా, భార్య తల దిండుతో ముఖంపై గట్టిగా అదిమి పట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. అయితే ఈ విషయం ఎవరికీ తెలియకుండా మద్యం తాగి తమతో గొడవ పడుతూ తనంతట తాను కిందపడి మృతి చెందాడని నమ్మబలికారన్నారు. అయితే పోస్టుమార్టం నివేదిక ఆధారంగా, అలాగే సాక్ష్యాల మేరకు వారే హత్య చేశారని నిర్ధారించామన్నారు. వారు చేసిన నేరం అంగీకరించడంతో సోమవారం రాత్రి అరెస్ట్ చేసి మంగళవారం కోర్టుకు హాజరు పరచగా మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసిన ఎస్ఐ చిన్నపెద్దయ్యను సీఐ అభినందించారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజారెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : కొన్ని రోజుల క్రితం ప్రొద్దుటూరులో జరిగిన చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాజారెడ్డి మంగళవారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 1న పట్టణంలోని ఇస్లాంపురం వీధిలో కూర్చొని ఉన్న మహిళ మెడలో నుంచి ఇద్దరు వ్యక్తులు బంగారు గొలుసును లాక్కొని వెళ్లారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కేసు దర్యాప్తులో భాగంగా ప్రొద్దుటూరులోని మట్టిమసీదు వీధికి చెందిన షేక్ ఇర్ఫాన్, పెన్నానగర్‌కు చెందిన బుక్కె ఠాగూర్ నాయక్‌లు చైన్ స్నాచింగ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు బైపాస్ రోడ్డులో ఉండగా వన్‌టౌన్ ఎస్ఐ అమర్నాథ్‌రెడ్డి సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 2 రెండు తులాల బంగారు చైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపించనున్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసు ఛేదనలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఎస్ఐ అమర్నాథరెడ్డి, సిబ్బందిని ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ అభినందించారు.

నెక్ట్స్ పరీక్షపై అపోహలు తొలగాలి

కడప అర్బన్ : దేశవ్యాప్తంగా వున్న మెడికల్ కళాశాలల్లో వైద్య విద్య ఫైనలియర్ విద్యార్థుల్లో 'నెక్ట్స్' (నేషనల్ ఎక్సిట్ టెస్ట్)పై అపోహలు తొలగాలని నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ సురేష్ చంద్రశర్మ అన్నారు. మంగళవారం వెబినార్ ద్వారా దేశవ్యాప్తంగా వున్న 675 ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఫైనలియర్ వైద్య విద్యను అభ్యసిస్తున్న లక్షా 9 వేల మందికి ఒకేసారి అవగాహన కల్పించారు. ఈ పరీక్ష నిర్వహించే విధానంపై అవగాహన కల్పించారు. కడప రిమ్స్ వైద్య కళాశాల ఆవరణంలోని లెక్చర్‌హాల్‌లో నిర్వహించిన ఈ వెబినార్‌కు 150 మంది ఫైనలియర్ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కడప రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సురేఖ, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ శ్రీనివాసరాయక్, డి.డి డాక్టర్ శంకర్‌రెడ్డి, మెడికల్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ డాక్టర్ రవికుమార్, ఫార్మకాలజీ హెచ్ఓడీ విజయభాస్కర్, ఏఓ శారద, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసు నిందితులను కస్టడీకి కోరిన పోలీసులు

కడప అర్బన్ : వైఎస్ఆర్‌సీపీ నాయకుడు చిన్ననాగిరెడ్డిగారి శ్రీనివాసులరెడ్డి(42)ని ఈ నెల 23న దారుణంగా హత్య చేసిన ఆరుగురు నిందితులను ఈ నెల 26న అరెస్ట్ చేశారు. వారిని మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు కడప కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ సంఘటనపై మరింత లోతుగా విచారణ కొనసాగించేందుకు నిందితులను కస్టడీకి ఇవ్వాలని కడప ఒన్ టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు కోర్టులో పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ మేరకు కోర్టు అనుమతిస్తే వారిని కస్టడీకి తీసుకుని విచారణ చేయనున్నారు.

కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటా



గృహ సారథి పిల్లల చదువు కోసం డబ్బు ఇస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దశెట్టిపల్లె గ్రామానికి చెందిన గృహ సారథి దస్తగిరి మరణించారు. దస్తగిరి సతీమణి సిరాజున్ వలంటీర్‌గా పనిచేస్తున్నారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే గతంలోనే రూ.2లక్షలు ఆర్థిక సహాయం అందించారు. వీరి పిల్లలు సుఫియాన్ ఒకటో తరగతి, సాదిక్ మూడో తరగతి, సిఫాజోయ ఐదో తరగతి స్థానిక పూజా స్కూల్‌లో చదువుతున్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మంగళవారం పూజా స్కూల్‌కు వెళ్లి ముగ్గురు పిల్లలు పదో తరగతి వరకు చదువుకునేందుకు అయ్యే డబ్బు మొత్తం రూ.9.33 లక్షలు నగదు స్కూల్ యాజమాన్యానికి చెల్లించారు.

పెద్ద కుమార్తెకు రూ.10 లక్షల బాండు

దస్తగిరి పెద్ద కుమార్తె సిఫాజోయ ఐదో తరగతి చదువుతుండగా ఆమె వివాహం అయ్యేనాటికి రూ.10లక్షలు విలువగల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండును ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అందించారు. దస్తగిరి సతీమణి వలంటీర్ సిరాజున్ మాట్లాడుతూ తమ కుటుంబానికి రూ.20లక్షలకుపైగా సాయం అందించిన ఎమ్మెల్యే రాచమల్లును జీవితాంతం గుర్తు పెట్టుకుంటామని తెలిపారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బండి ఆత్మకూర్ సుధాకర్‌రెడ్డి, సాదక్, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేశ్వారెడ్డి, కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద పాల్గొన్నారు.